క్లుప్తంగా

యోగాతో మానసిక ప్రశాంతత



తెనాలిఅర్బన్: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మున్సిపల్ మేనేజర్ విల్సన్ జయకర్ పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న యోగా శిక్షణ తరగతులు సోమవారం ఆయన పరిశీలించారు. యోగా గురువులు స్థానికులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రహదారులు నిర్మించాలంటూ వినతి



తెనాలిఅర్బన్: 12, 32 వార్డుల్లో నూతన రోడ్లు నిర్మించాలని ఆ ప్రాంత వాసులు కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఇన్‌ఛార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అలాగే 30వ వార్డులో నూతన నిర్మిస్తున్న మురుగు కాల్వను త్వరగా పూర్తి చేయాలని పలువురు కోరారు. వీటన్నింటినీ పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏసీపీ శివన్నారాయణ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఉద్యోగి ఆత్మహత్య



తెనాలిరూరల్: ఆర్థిక ఇబ్బందులతో ప్రైవేటు ఉద్యోగి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జీఆర్పీ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ చినరావూరుకు చెందిన యడ్ల నాగవెంకట మల్లేశ్వరరావు (46) బీఎస్ఎన్ఎల్‌లో ప్రవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం రాత్రి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. సోమవారం ఉదయం వైకుంఠపురం నుంచి చినరావూరు స్టేషన్ల మధ్య పట్టాలపై అతడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెంకటాద్రిబాబు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మృతుడి ఆచూకీ తెలిస్తే సమాచారమివ్వండి

తెనాలిరూరల్: కాల్వలో కొట్టుకువచ్చిన మృతదేహాన్ని పోలీసులు తెనాలి ప్రభుత్వ వైద్యశాల మార్చురీలో భద్రపరిచారు. ఈ నెల 13న తెనాలి మండలం సంగం జాగర్లమూడి కాల్వలో సుమారు 45 నుంచి 50 ఏళ్ల మధ్య వయసున్న పురుషుడి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. మృతుడు నిండె నీలం రంగు మీద గళ్ల చొక్కా, లుంగీ ధరించి ఉన్నాడు. మూడు రోజులైనా మృతుడి ఆచూకీ తెలియడం లేదు. ఆచూకీ తెలిసిన రూరల్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ ఆనంద్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

రాడ్ బెండింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా నాగేశ్వరరావు



తెనాలిఅర్బన్: తెనాలి డివిజన్ రాడ్ బెండింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా బండ్లమూడి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా తొట్టెంపూడి సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా దారా వెంకటవర్ధన్, సహాయ కార్యదర్శిగా శెట్టి ఏసోబు, కోశాధికారిగా మక్కెన కోటేశ్వరరావులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు నాయకులు తెలిపారు. చెంచుపేటలోని ప్రజ సంఘాల కార్యాలయంలో ఆదివారం సాయంత్రం కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన వారిని అభినందించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.బి.ప్రసాద్, షేక్ హుస్సేన్‌వలీ, కొలనీడి రవికుమార్ పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై 14 అర్జీలు

తెనాలి: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో మొత్తం 14 అర్జీలు వచ్చాయి. సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. రెవెన్యూకు సంబంధించి మూడు అర్జీలు రాగా, మున్సిపాలిటీ, పోలీస్ శాఖల పరిధిలోనివి నాలుగేసి చొప్పున వచ్చాయి. సర్వే విభాగం, పంచాయతీరాజ్, డీఆర్‌డీఏ- పీడీ పరిధిలోని అంశాలపై ఒక్కొక్కటీ వంతున అర్జీలు వచ్చాయి. వీటిని సంబంధిత అధికారులకు పంపి, నిర్ణీత వ్యవధిలోగా పరిష్కారానికి కృషిచేస్తామని సబ్‌కలెక్టర్ సంజనా సింహ వెల్లడించారు. సమావేశానికి వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు హాజరయ్యారు.

రుణాలకు ‘కూటమి’ పంగనామం

- రెండు నెలలు కావస్తున్నా ప్రారంభంకాని ప్రక్రియ
- వ్యక్తిగత రుణాలు ఇచ్చేందుకు ముందుకు రాని బ్యాంక్ అధికారులు
- నిరుద్యోగులు ఎదురు చూపులు



పట్టణంలో రుణమేళాకు హాజరైన దరఖాస్తుదారులు (ఫైల్)

తెనాలిఅర్బన్: ఎస్సీ, బీసీ, ఓసీ వ్యక్తిగత సబ్సిడీ రుణాల మంజూరును కూటమి ప్రభుత్వం ఆదిలోనే నిలిపివేసింది. అర్హులైన వారిని దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించటంతో పాటు వారి సర్టిఫికెట్‌ల వెరిఫికేషన్‌ను అట్టహాసంగా చేసి తర్వాత వాటి ఊసే మరిచింది. దీంతో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. తెనాలి పట్టణం, మండల పరిధిలోని ఎస్సీ, బీసీ, ఓసీ సామాజిక వర్గాలకు చెందిన వారికి వ్యక్తిగత రుణాలు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఏప్రిల్ నెలలో సూచించింది. రూ.లక్ష నుంచి అయిదు లక్షల వరకు రుణం ఇప్పిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అంతేకాకుండా రుణంలో 50 శాతం ప్రభుత్వం సబ్సిడీ కింద చెల్లిస్తోందని తెలిపింది. దీంతో తెల్లరేషన్ కార్డు కలిగి ఉండి, ఏదోక వ్యాపారం చేసుకునే వారు, చేయాలని భావించే వారు పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. పట్టణ పరిధిలోని వారి కోసం కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో, మండల పరిధిలోని వారి కోసం ఎంపీడీవో కార్యాలయంలో రుణా మేళాలను ఇటీవల నిర్వహించారు. అన్ని బ్యాంక్‌లకు చెందిన ఉద్యోగులు మేళాలో పాల్గొని దరఖాస్తు చేసుకున్న వారి విద్యార్హత సర్టిఫికెట్లు, క్యాస్ట్, ఇన్‌కం వంటి వాటిని పరిశీలించి వాటి నకలు కాపీలు తీసుకున్నారు.

తెనాలి పరిధిలో 3099 మంది దరఖాస్తు

వ్యక్తిగత రుణాల కోసం రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఏప్రిల్‌లో బీసీ, ఓసీ సామాజిక వర్గాలకు చెందిన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించడంతో తెనాలి పట్టణ, మండల పరిధిలో 2,453 మంది దరఖాస్తు చేసుకున్నారు. మే నెలలో ఎస్సీ సమాజిక వర్గాలకు సబ్సిడీపై వ్యక్తిగత రుణాలు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. దీంతో తెనాలి పట్టణంలో 360 మంది, మండల పరిధిలో 286 మంది దరఖాస్తు చేసుకున్నారు. కాని ఇప్పటి వరకు వారి సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను చేయలేదు. ఎప్పుడు చేస్తారో కూడా చెప్పలేని స్థితిలో అధికారులు ఉన్నారు.

10 శాతం మందికి కూడా ఇవ్వని వైనం!

తెనాలి పట్టణ, మండల పరిధిలో ఓసీ, బీసీ రుణాల కోసం 2453 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో తెనాలి పట్టణ పరిధిలో బీసీ రుణాల కోసం 1169 మంది, ఓసీ రుణాల కోసం 447 మంది దరఖాస్తు చేసుకున్నారు. అలాగే తెనాలి మండల పరిధిలో బీసీ రుణాల కోసం 525 మంది, ఓసీ రుణాల కోసం 312 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే ప్రభుత్వం వీరిలో తెనాలి పట్టణంకు కేవలం 155 మందికి, మండల పరిధిలో 96 మందికి మాత్రమే సబ్సిడీ రుణాలు ఇచ్చేందుకు అనుమతి ఇచ్చింది.

వీరిలో పట్టణ పరిధిలో బీసీలు–88, ఓసీలు–67, మండల పరిధిలో బీసీలు–51, ఓసీలు–45 మంది ఉంటారు. దీన్ని బట్టి చూస్తే దరఖాస్తు చేసుకున్న వారిలో కనీసం 10 శాతం మందికి కూడా రుణాలు ఇవ్వటం లేదని విషయం స్పష్టం అవుతుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి వ్యక్తిగత రుణాల మంజూరులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైన ఉంది.

ముందుకు రాని బ్యాంక్ అధికారులు



ఎంపీడీవో కార్యాలయంలో సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న బ్యాంకు అధికారులు (ఫైల్)

సబ్సిడీపై ఇచ్చే వ్యక్తిగత రుణాల ప్రక్రియ ఆదిలోనే నిలచిపోయింది. మొదట విడతలో బీసీ, ఓసీ సామాజిక వర్గాలకు చెందిన వారి దరఖాస్తులు రుణ మేళలో బ్యాంక్ ఉద్యోగులు పరిశీలించారు. ఎక్కువ మందికి ఎటువంటి అస్తులు లేకపోవటం.. కనీసం ష్యూరిటీ పెట్టే పరిస్థితి కన్పించకపోవటంతో రుణాలు ఇచ్చేందుకు బ్యాంక్ అధికారులు విముఖత చూపారు. దీంతో ఏమి చేయలో తెలియక స్థానిక అధికారులు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. వారి నుంచి ఇప్పటి వరకు ఎటువంటి ఆదేశాలు రాలేదు.

ఆదేశాలొస్తే వెంటనే అందిస్తాం



ఎస్సీ, బీసీ, ఓసీ సామాజిక వర్గాలకు సంబంధించిన వ్యక్తిగత రుణాల మంజూరు తాత్కాలికంగా నిలచిపోయింది. బీసీ, ఓసీలకు సంబంధించిన రుణ మేళాలు నిర్వహించి బ్యాంక్ అధికారులకు దరఖాస్తులు అందజేశాం. ఎస్సీ రుణాల దరఖాస్తుల పరిశీలన ఇంకా జరగలేదు. ప్రభుత్వం నుంచి వీటి మంజూరుకు సంబంధించిన ఆదేశాలు రాలేదు. అవి రాగానే వాటిని అందజేసే విధంగా చర్యలు తీసుకుంటాం.

–అత్తోట దీప్తి, ఎంపీడీవో, తెనాలి

వయోవృద్ధులపై దాడులు నియంత్రించాలి

తెనాలి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వినతి



సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహాకు వినతిపత్రం ఇస్తున్న సంఘ నేతలు

తెనాలి: వయోవృద్ధులపై దాడులను అన్ని ప్రభుత్వ ఏజెన్సీలు ఖండించాలని, అలాంటి దాడులపై పోలీస్ యంత్రాంగం వెంటనే స్పందించాలని కోరుతూ తెనాలి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహాకు వినతిపత్రం సమర్పించారు. ప్రపంచ వయోవృద్ధుల వేధింపుల నివారణ అవగాహన దినోత్సవం రోజు సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. గృహహింసపై ఏవిధంగా అయితే స్త్రీలకు ప్రభుత్వం రక్షణ కల్పిస్తూ ఉన్నదో.. అలాగే కుటుంబాల్లో వృద్ధుల పట్ల కుటుంబ సభ్యులు ప్రవర్తిస్తున్న తీరును పరిగణన లోకి తీసుకొని వృద్ధులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. వృద్ధుల ఆస్తి, ప్రాణ రక్షణకు ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. అద్దెలపై జీవనం సాగిస్తున్న వృద్ధులపై అద్దెకు ఉంటున్నవారి దాడులపైనా స్పందించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం 2007లో చేసిన వయో వృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం, అనుబంధంగా 2011లో రాష్ట్ర ప్రభుత్వ చట్టంపై కరపత్రాలు, పోస్టర్లను ముద్రించాలనీ, సచివాలయాలు, నగర పంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయం వద్ద ప్రదర్శించాలని సూచించారు. ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం కల్పించాలని కోరారు. సంస్థ అధ్యక్షుడు గుమ్మడి నారాయణ రావు, కార్యదర్శి కావూరి నాగేశ్వర రావు, ఉపాధ్యక్షుడు పీవీ రామబాబు, సంయుక్త కార్యదర్శి అర్ భుజంగ రావు, కోశాధికారి పి.మల్లికార్జున రావు, ఎం.అర్జున్, వైఎస్‌సీ బోస్, వై.రాధాకృష్ణ, కె.చంద్రమౌళి, ఎస్.వెంకటేశ్వర రావు, ఎస్.మల్లికార్జునరావు పాల్గొన్నారు.

ప్రజలందరూ భాగస్వాములు కావాలి



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ అన్నపూర్ణ

తెనాలి డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఈ.అన్నపూర్ణ

తెనాలిఅర్బన్: టీబీ రహిత దేశంగా తీర్చిదిద్దే కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని తెనాలి డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఈ.అన్నపూర్ణ పిలుపునిచ్చారు. టీబీ ముక్త భారత్ అభియాన్ ఇంటెన్సిఫైడ్ క్యాంపెయిన్‌లో భాగంగా పాత ప్రభుత్వ వైద్యశాలలో సోమవారం వాటికి సంబంధించిన పోస్టర్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వచ్చే మూడు నెలల్లో క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు ప్రకటించారు. అలాగే క్షయ వ్యాధి బారినపడిన వారితో పాటు వారి కుటుంబ సభ్యులకు స్క్రీనింగ్ టెస్ట్‌లు చేయనున్నట్లు చెప్పారు. టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి.రమాదేవి మాట్లాడుతూ 60 సంవత్సరాలు దాటిన వృద్ధులకు షుగర్, పొగ తాగే వారికి అల్కాహాలు సేవించే వారికి గత ఐదు సంవత్సరాల్లో క్షయ వ్యాధి మందులు వాడిన వారికి ప్రత్యేక పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. క్షయ వ్యాధిపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా వైద్యశాల ఆర్ఎంవో డాక్టర్ మల్లిఖార్జునరావు మాట్లాడుతూ ఆధునాతన టీబీ పరీక్షలు చేసే పరికరాలు వైద్యశాలలో ఉన్నాయన్నారు. అవసరమైన వారు వాటిని ఉపయోగించుకోవాలన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియాంక, డాక్టర్ రక్షిత్, డాక్టర్ హనోకులు మాట్లాడుతూ ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు జన్ భగీరథి కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. వృద్ధాశ్రమాలు, నైట్ షల్టర్లు, వసతి గృహాల్లో ఉన్న వారికి క్షయ వ్యాధిపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పల్లెకొండ రవికుమార్, లక్ష్మీ, దిలీప్, భార్గవి, హెచ్‌వీలు వెంకటేశ్వరమ్మ, విజయకుమారి, పుష్పలత పాల్గొన్నారు.

షాదీఖానాల నిర్మాణాన్ని పూర్తిచేయాలి

ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ సమావేశం వినతి



అడ్‌హాక్ కమిటీల జాబితాతో ముఖ్యనేతలు

తెనాలి: నియోజకవర్గంలో 2018లో నిర్మాణం ఆరంభించి వివిధ దశల్లో ఆగిపోయిన షాదీఖానాల పనులను పూర్తిచేసి ముస్లిం సమాజానికి ఉపయోగపడేలా చూడాలని ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ (ఎంయూఎఫ్) ముఖ్య కార్యకర్తల సమావేశం కోరింది. ఇందుకు స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ చొరవ తీసుకోవాలని విజ్ఞప్తిచేసింది. స్థానిక చినరావూరు తోటలో మైనారిటీ నేత షేక్ ఖలీల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంయూఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎండీ కలీమ్ ఆదేశాల ప్రకారం తెనాలి పట్టణ, తెనాలి రూరల్ మండలం, కొల్లిపర మండలాల అడ్‌హాక్ కమిటీలను నియమించారు. రానున్న నాలుగు నెలల్లో అన్ని గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ఎంయూఎఫ్ బలోపేతానికి విస్తృత స్థాయిలో సభ జరపాలని తీర్మానించారు. పట్టణ అడహాక్ కమిటీలో షేక్ దావూద్, షేక్ నఫీజ్, షేక్ మగ్బూల్, షేక్ మస్తాన్ షరీఫ్, షేక్ రహ్మతుల్లా, షేక్ షంషుద్దీన్, షేక్ పయాజ్, షేక్ జాలు, షేక్ అబ్బాస్ ఉండగా, రూరల్ మండల కమిటీలో పఠాన్ కరిముల్లాఖాన్, షేక్ సలామ్, షేక్ అజ్మతుల్లా, షేక్ జాకీర్, షేక్ అజీజ్, కొల్లిపర మండల కమిటీలో షేక్ హఫీజుల్లా, పఠాన్ గాలిబ్ షంగీర్, షేక్ కుతుబుద్దీన్, షేక్ మీర్‌ఖాశిం, షేక్ సుభాని ఉన్నారు.

ప్రతిభావంతులకు ఆర్థిక సాయం



విద్యార్థినులకు ఆర్థికసాయం

తెనాలి: పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు ‘ఉపాధ్యాయ రత్న’ యంగ్రపాటి చింపయ్య సోమ వారం పట్టణంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో పదోతరగతిలో ప్రథమస్థానం సాధించిన విద్యార్థినులకు రూ.1,116 చొప్పున ఆర్థికసాయం అందజేశారు. తన కుమార్తె స్మారకార్థం ఆర్‌కే మెమోరియల్ ఫండ్ నుంచి ఆరు ఉన్నత పాఠశాలల్లో ప్రథమంగా వచ్చిన ఆరుగురికి ఈ సాయం అందించారు. బాలికల హైస్కూలు విద్యార్థిని షేక్ ఉస్నేజహా, ఎస్ఎస్ఎం హైస్కూలు విద్యార్థిని వి.లక్ష్మీ మాధురి, రావి సాంబయ్య మున్సిపల్ హైస్కూలు విద్యార్థిని జి.యోషా, టీఎస్సార్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని షేక్ సాన్ హీరా, కేఎస్ఎం స్కూల్ విద్యార్థిని యు.నేహాకుమారి, ఎస్సీఆర్ఏ హైస్కూల్ విద్యార్థిని యార్లగడ్డ అలేఖ్య నగదును అందుకున్న వారిలో ఉన్నారు.

స్థానిక మారీసుపేటలోని ఎన్‌సీఆర్ఎం హైస్కూలులో జరిగిన కార్యక్రమంలో చింపయ్యతోపాటు విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు బషీర్ అహ్మద్, గరికపాటి రేణుకయ్య, సాయిబాబు, శివనాగ పార్వతి పాల్గొన్నారు.

ప్రతినెలా ఒక పుస్తకం పరిచయం చేయాలి



కవిత్వంతో కాసేపులో కవులు

నగరంపాలెం: స్థానిక కొరిటెపాడు సాకేతపురం వీధిలోని గుంటూరు జిల్లా రచయితల సంఘ సభ్యులు దారివేముల అనిల్‌కుమార్ నివాసంలో సోమవారం కవిత్వంతో కాసేపు నిర్వహించారు. సంగీత సాహిత్య ప్రముఖులు భూసురపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కవిత్వమనగా రాయడంతో పాటు చదవడం తెలిసి ఉండాలని అన్నారు. కవిత్వం రాసేటప్పుడు చేసే పద ప్రయోగం సందర్భోచితంగా ఉండాలని పేర్కొన్నారు. ఏ పదం ఏ సందర్భంలో వాడాలనేది కవి ఒకటికి రెండుసార్లు సమీక్షించుకోవాలని చెప్పారు. అర్థం, భావం మారకుండా కొత్త పదాలు రాయాలని వివరించారు. ప్రతినెలా కవిత్వంతో పాటు ఒక పుస్తకాన్ని పరిచయం చేస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. అనంతరం కవులు తమ స్వీయ కవితలతో పాటు ఇతర కవుల కవితలను చదివారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.సుభాని, ఎం.సుభాద్రాకృష్ణ, సంబరాజు రమణి, తాటికోల పద్మావతి, ఎం.లలితకుమారి, షేక్.మస్తాన్‌బాబు, మెట్టు శ్రీనివాసరెడ్డి, సి.సురేష్, పి.బలరాం, బండికల్లు జమదగ్ని, నానా, శ్రీ వశిష్ట సోమేపల్లి పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల శాంతి కల్యాణం



నగరంపాలెం: స్థానిక మల్లారెడ్డినగర్ శ్రీవిఘ్నేశ్వర స్వామి సహిత ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయ దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. గోపూజ, మండపారాధన, అయ్యప్ప స్వామికి పంచామృతాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు. స్వామియే శరణం అయ్యప్ప శరణు ఘోషతో మార్మోగింది. ఆలయ అర్చకులు చంద్రశేఖర్‌శర్మ, శివకుమార్‌శర్మ, శ్యామ్ బృందం పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం హోమం మహాపూర్ణాహుతి, మెట్ల పూజ, శివపార్వతుల కల్యాణం వైభవంగా కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం కల్యాణమూర్తులతో శోభాయాత్ర అయ్యప్ప స్వామికి పుష్పాభిషేకంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో ఏంకేఆర్ అయ్యప్పస్వామి ఫౌండేషన్ చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి దంపతులు, అన్నదాన కమిటీ చైర్మన్ గుంటూరు వేమారెడ్డి, సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడికి జైలు శిక్ష

తెనాలిరూరల్: చోరీ కేసులో నిందితుడికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పొన్నూరుకు చెందిన సంకాల సుకన్య 2021 ఆగస్ట్ 26న బాపట్ల జిల్లా కొల్లూరులో జరిగిన తన తమ్ముడి గృహప్రవేశానికి హాజరైంది. రాత్రికి కొత్త ఇంటిలోనే అందరూ నిద్రపోయారు. మర్నాడు ఉదయం లేచి చూడగా సుకన్యకు చెందిన సుమారు రూ. 7.40 లక్షల విలువైన ఆభరణాలు ఉన్న బ్యాగు కనబడకుండాపోయింది. దీనిపై ఆమె కొల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్ఐ ఉజ్వల్ కుమార్ కేసు నమోదు చేశారు. దర్యాప్తులో నిందితుడు కొల్లిపర మండలం హనుమాన్‌పాలెం గ్రామానికి చెందిన మర్రి వెంకయ్యగా గుర్తించి అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. కేసు సోమవారం విచారణకు రావడంతో సాక్ష్యాధారాలను పరిశీలించిన రెండో అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ బి.రాజశేఖర్ నిందితుడికి ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున సీనియర్ ఏపీపీ పరిశపోగు సునీల్‌కుమార్ వాదించారు.

డ్రైయినేజీలోకి వెళ్లిన ప్రైవేటు బస్సు



తెనాలి రూరల్: రివర్స్ చేస్తున్న సమయంలో ప్రైవేటు బస్సు డ్రైయినేజీలోకి వెళ్లిన ఘటన మండలంలోని అంగలకుదురులో గల పెట్రోలు బంకు వద్ద సోమవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని పెట్రోలు బంకు వద్దకు ప్రైవేటు ట్రావెల్స్‌కు చెందిన ఎలక్ట్రిక్ బస్సు హైదరాబాద్ ట్రిప్‌కు వెళ్లి వచ్చింది. రివర్సు చేస్తున్న సమయంలో డ్రైవరు కునుకు వేయడంతో నియంత్రణ కోల్పోయింది. బంకు ఎదురు ఉన్న తెనాలి–గుంటూరు రహదారిని దాటుకుని పక్కనే ఉన్న డ్రైయినేజీలోకి వెళ్లిపోయింది. దీని వల్ల రహదారిపై పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. స్థానికులు క్రేన్‌ను తెప్పించి వెనక్కు లాగించారు. బస్సు కాల్వలోకి వెళుతున్నప్పుడు ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

కొల్లిపర వ్యవసాయాధికారిగా శ్రీనివాసరెడ్డి

కొల్లిపర: మండల వ్యవసాయ అధికారిగా ఎస్.శ్రీనివాసరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీనివాసరెడ్డి పిడుగురాళ్ల మండలంలో మండల వ్యవసాయ అధికారిగా పనిచేస్తూ బదిలీపై కొల్లిపర మండలంకు వచ్చినట్లు తెలిపారు. ఇక్కడ పని చేస్తున్న ఏవో కె.వెంకట్రావు కమిషనరేట్ కార్యాలయం కు బదిలీ అయ్యారు.

కాల్వల్లో వ్యర్థాలను పూర్తిగా తొలగించండి

మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు



తెనాలిఅర్బన్: కాల్వల్లోని వ్యర్థాలను పూర్తిగా తొలగించాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు సూచించారు. ఐతానగర్ పాటి కాల్వలో సోమవారం జరుగుతున్న వ్యర్థాల తొలగింపు కార్యక్రమాన్ని సోమవారం ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రధాన మురుగు కాల్వల పూడికతీత పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. కాల్వల్లో ఉన్న వ్యర్థాలను పూర్తిగా తొలగిస్తే పారుదల ఎక్కువగా జరిగే అవకాశం ఉందన్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు ఉన్నారు.

ద్విచక్ర వాహనాన్ని వదిలి వెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు



గుర్తు తెలియని వ్యక్తులు విడిచి వెళ్లిన వాహనం

దుగ్గిరాల: నెల రోజుల క్రితం వీర్లపాలెంలోని జయలక్ష్మీ రైస్ మిల్లు దగ్గర ఓ ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు విడిచి వెళ్లారు. రైస్ మిల్లు యజమాని ఆళ్ల గోవింద రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు పల్సర్ బైక్ 150సీసీ రిజిష్టర్ నంబరు ఏపీ39బీపీ7482ను నెల రోజుల కిందట రైస్ మిల్లు దగ్గర విడిచి వెళ్లారు. దీనిపై మిల్లు యజమాని పోలీసులకు 10 రోజుల క్రితం ఫిర్యాదు చేశారు. కాగా స్థానికులు ఆయన వద్దకు వచ్చి ఆ వాహనం తమదేనంటూ ఇవ్వమని మిల్లు యజమానిని అడిగారు. పోలీసులకు ఫిర్యాదు చేశానని.. వారిని అడిగి చట్టప్రకారం తీసుకోమని చెప్పగా స్థానికులు గొడవకు దిగుతున్నారని మిల్లు యజమాని తెలిపారు. అసలు బైక్ హక్కుదారుడు కాకుండా సంబంధం లేని వ్యక్తులు వచ్చి అడగడం గమనార్హం. పోలీసులు త్వరితగతిన ద్విచక్రవాహనాన్ని స్టేషన్‌కు తరలించి ఎవరిదో వారికి అందజేయాలని ఆయన అన్నారు.

సాగునీటి కాలువలను ఆధునీకరించాలి



చానల్‌ను పరిశీలిస్తున్న రైతు సంఘాల నాయకులు

మంగళగిరి: ప్రభుత్వం వెంటనే సాగునీటి కాలువలను ఆధునీకరించి రైతులకు సాగునీరు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సాగునీటి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సాగునీటి సంఘాల నాయకులు, కౌలు రైతు సంఘం నాయకులు, రైతు సంఘం నాయకులు మండలంలోని పెదవడ్లపూడి హైలెవల్ చానల్ మద్రాస్ కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలువలను ఆధునీకరించే పనులు చేపట్టకపోవడంతో కాలువలలో పెద్ద ఎత్తున తూటికాడ, గుర్రపు డెక్క, మట్టి మేటలతో కూరుకుపోయి నీరు పారుదల నిలిచిపోయిందన్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకర్ మాట్లాడుతూ.. కృష్ణానది ఉండవల్లి నుంచి ప్రారంభమైన బకింక్ హామ్ కెనాల్ నిజాంపట్నం వరకు తెనాలి డెల్టా ఏరియాలో 7 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తుందన్నారు. కానీ బకింగ్ హామ్ కెనాల్, తెనాలి డెల్టా కాలువల ఆధునీకరణకు కోట్ల రూపాయాలు మంజూరైనప్పటికీ పనులు జరగడం లేదన్నారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు ములక సాంబిరెడ్డి, నాగమల్లేశ్వర రావు, జెట్టి బాలరాజు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కారుమూరి మాధవరెడ్డి, బి.సత్యమారెడ్డి, గాదె మాధవరెడ్డి, ఎస్.రామిరెడ్డి, ఈదా మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలపాటి వెంకట్రామయ్యకు ఘననివాళి

తెనాలి: పట్టణానికి చెందిన రాష్ట్ర మాజీ మంత్రి ఆలపాటి వెంకట్రామయ్య 60వ వర్ధంతి సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట గల ఆయన విగ్రహానికి పలువురు పుష్పాంజలి సమర్పించారు. తెనాలి మున్సిపాలిటీకి చైర్మన్‌గా, మూడు పర్యాయాలు తెనాలి ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా ఆలపాటి వెంకట్రామయ్య పనిచేశారని వారు గుర్తు చేసుకున్నారు. రణ రంగచౌక్‌లో అమరవీరుల స్మారక స్తూపాల నిర్మాణకర్తగా, పట్టణంలో రైల్ ఓవర్ బ్రిడ్జి, మున్సిపల్ కార్యాలయాల నిర్మాణంతో సహా పట్టణ ప్రగతికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో గుమ్మడి రమేష్, ఆలపాటి వెంకట్రామయ్య, రాజశేఖరరెడ్డి, కన్నెగంటి మురళీకృష్ణ, ఆలపాటి కిరణ్ పాల్గొన్నారు.

